క్లుప్తంగా

పెళ్లికి నిరాకరించాడని ఫిర్యాదు

భీమవరం: గతకొన్నేళ్లుగా ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన యువతి పోలీసులను గురువారం ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యువకుడిపై సీఐ జి. కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

కాళ్ల: కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదఅమీరం గ్రామానికి చెందిన వివాహిత భర్త చనిపోవడంతో తండ్రి వద్ద ఉంటుంది. ఈనెల 2వ తేదీ 11 గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలను వదిలి వెళ్లిపోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులే దిక్సూచి



భీమవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడానికి నాంది ఉపాధ్యాయులేనని మెంటే పార్థసారథి, పులపర్తి సత్యవాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురు పూజోత్సవం సందర్భంగా గురువారం ఉపాధ్యాయులను సత్కరించిన సందర్భంగా మాట్లాడారు. విలువలతో కూడిన విద్యనందిస్తూ సమాజానికి దిక్సూచిగా ఉపాధ్యాయులు నిలుస్తున్నారని, ఉపాధ్యాయులను గౌరవించుకోవడమంటే మన సంస్కృతిని మనం గౌరవించుకోవడమేనన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, సమున్నత జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి బ్రహ్మకుమారీస్ రేవతి, కంతేటి వెంకటరాజు, వడుపు గోపి, సుభద్ర, కె నిర్మల, గంధం శ్రీదేవి, చీడే అమ్మజీ, కలిగొట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద శ్రీ వరసిద్ధి వినాయక 25వ వార్షిక మహోత్సవంలో భాగంగా గురువారం అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం 5 కేజీల లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించగా, ప్రమీల వెంకన్నబాబు రూ.16,300కు దక్కించుకున్నారు.

గృహాల సర్వే వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వామిత్వ యోజన ఫేజ్-1లో గ్రామ కంఠంలోని ప్రభుత్వ భూముల, ప్రైవేటు భూములు, గృహాల సర్వే వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వామిత్వ యోజనలో గృహాల సర్వే ప్రగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 200 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గృహాలు సర్వే చేయడం జరుగుతోందన్నారు. సర్వేలో అలసత్వం వహించే అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కలుపు కలవరం

- ఎకరానికి రూ. 2వేలు నుంచి 3 వేలు ఖర్చు
- నివారించకపోతే తక్కువ దిగుబడి



భీమవరం మండలంలోని యనమదుర్రులో కలుపు మొక్కలను నిర్మూలిస్తున్న రైతులు

భీమవరం అర్బన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ముందుగా వరి నాట్లు వేసిన సాగులో కలుపు సమస్య రైతులను కలవర పెడుతోంది. భీమవరం మండలంలోని సుమారు 7 వేల ఎకరాలలో సార్వా సాగు చేస్తున్నారు. వేసవిలో సుమారు 3 నెలలు పాటు చేలను బీడులు చేయడంతో పొలాల్లో కలుపు మొక్కలు, గడ్డి ఎక్కువగా వస్తుందని దుక్కలు దున్నితే కలుపు రాదని వ్యవసాయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే కలుపు, గడ్డి జాతి వేర్లు అక్కడక్కడ ఉండిపోయి ఖరీఫ్ సాగులో కలుపు ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు. సన్న, చిన్నకారు రైతులు తమ పొల్లాలో కలుపును తొలగించుకోగా మరి కొంతమంది కలుపును కూలీలను పెట్టి తొలగిస్తున్నారు. ఎకరానికి 6 గురు కూలీలను పెట్టి తొలగిస్తున్నామని దీంతో రూ. 2వేలు నుంచి మూలు వేలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. అదీకాకుండా ఇలా కలుపు మొక్కలను తొలగించేటప్పుడు చేలల్లో కలియ తిరగడం వల్ల వరి మొక్కకు ఉన్న వేళ్లు తెగి కొత్త వేర్లతో దుబ్బు బాగా చేస్తుందని కొంత మంది రైతులు చెబుతున్నారు. మరికొంత మంది రైతులు పంట దెబ్బతినకుండా కలుపును నిర్మూలించేందుకు మందులను పిచికారి చేస్తున్నారు. ఈ కలుపు మొక్కలు సకాలంలో నివారించకపోతే పంటకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం

వరి మొక్కలతో కలుపు మొక్కలు అధికంగా పెరిగి భూసారాన్ని అధికంగా గ్రహిస్తుందని వాటిని తొలగించకపోతే ఖర్చు కూడా ఎక్కువగా అయ్యి దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఖరీఫ్‌లో తెగుళ్ల ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రోజు చేల వద్దకు వెళ్లి రైతులు వరి చేలను పరిశీలించి ఏ తెగులు వ్యాప్తి చెందు తుందో గమనించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. తెగుళ్ల ఉధృతిని బట్టి మందులు వాడాల్సి వస్తుందని, పొలాల్లో కలుపును సమర్థంగా నివారించి తెగుళ్లను అధిగమించగలిగితే అధిక దిగుబడికి ఢోకా ఉండదని వ్యవసాయాధికారులు రైతులకు చెబుతున్నారు.

కలుపు మొక్కలను ఆదిలోనే నివారించాలి



వరిలో కలుపు నివారించకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. కలుపును నివారించాలంటే ముందుగా చేలల్లోని నీటిని తొలగించి గడ్డి జాతి మొక్కలు ఉంటే సైహలోపాప్ బ్యుటైల్ (క్లించర్) 400 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డిజాతి, వెడల్పాడి ఆకులు ఉంటే బిస్ పైరిబాక్ సోడియం 100 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. కలుపు మందులను సరియైన సమయంలో సమ మోతాదులో పిచికారీ చేయాలి.

యర్రంశెట్టి ప్రసాద్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

లంకపేటలో పేదలు ఇళ్లు తొలగిస్తే ఆందోళన తప్పదు



భీమవరం లంకపేట వద్ద పేదల ఇళ్లు తొలగించవద్దంటూ ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణం 38వ వార్డు లంకపేటలో దళిత ఇళ్లను తొలగించవద్దంటూ ఆ ప్రాంత ప్రజలు గురువారం ఆందోళన చేపట్టారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్ మాట్లాడుతూ లంకపేట ప్రాంతంలోని డ్రెయిన్ అభివృద్ధి చేస్తామంటూ డ్రెయిన్ పక్కనే ఎన్నోఏళ్లుగా ఇల్లుకట్టుకుని నివాసముంటున్న దళితులు ఇళ్లు తొలగించాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది భూస్వాముల కోసం డ్రెయిన్ అభివృద్ధి అంటూ కుంటి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. అన్యాయంగా పేదల ఇళ్లు తొలగిస్తే దళిత, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో ఇళ్లు తొలగించి దళిత ప్రజల గొంతు కోయలని చూస్తే ఊరుకోమని సీపీఎం నాయకుడు ఎం వైకుంఠరావు, మాజీ కౌన్సిలర్ పిల్లి ముసలయ్యలు హెచ్చరించారు. ఇప్పటికే సుమారు 30 అడుగుల డ్రెయిన్ ఉండగా దానిని మరింత విస్తరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు పునః పరిశీలన చేసి పేదల ఇళ్లను తొలగించకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మావుళ్లు, మాదసు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు అక్షరం ఆయువు పట్టు

- సార్వత్రిక విద్యతో ఉన్నత చదువులు
- జిల్లా కోఆర్డినేటర్ ఎన్.సత్యనారాయణ వెల్లడి



స్థానికంగా దుఖాణాలు, బంకుల వద్ద సార్వత్రిక విద్యపై ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: సార్వత్రిక విద్యతో చిరుద్యోగులూ అక్షరాస్యులు కావచ్చునని, వారికి అదే ఆయువుపట్టు అని సార్వత్రిక విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎన్.సత్యనారాయణ చెప్పారు. సార్వత్రిక విద్యపై అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక జెడ్పీ స్కూల్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. దుఖాణాలు, బంకులు, ఇతర మెకానికల్ షాపుల వద్దకు వెళ్లి విద్యను సకాలంలో మానివేసినా మీ చెంతకు సార్వత్రిక విద్య వస్తుందని చెప్పారు. విద్యతో మీ భవిష్యత్ బంగారం అవుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్ మధ్యలో మానివేసినా, 8,9 తరగతుల వరకూ చదివి మానివేసినా తిరిగి విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్స్ ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో 22 ఓపెన్‌స్కూల్‌సెంటర్లు ద్వారా చదువు మానివేసిన వారు మళ్లీ విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చునని చెప్పారు. ఈ నెల 15వ తేదీలోపు ఆయా మండలం కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ.రవీంద్ర, ఎంఈఓ-2 సీతారామయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో విద్య సముపార్జన చేయాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: విద్యార్థులు తల్లితండ్రులను దైవంగా భావించి దేశం గర్వించేలా విజయాలు సాధించాలని ఆధ్యాత్మికవేత్త, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్ వి గంగాధరశాస్త్రి అన్నారు. గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం సాధించాలనే పట్టుదలతో విద్య సముపార్జన చేయాలన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని అనవసరమైన సోషల్ మీడియా వైపు మళ్లించకుండా మంచి అంశాలపై సాధన చేయాలన్నారు. భగవద్గీత ఒక మతానికి సంబంధించింది కాదని ప్రపంచమంతా మంచిని బోధించే గొప్ప గ్రంథంగా ఆయన పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంతవర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బిహెచ్‌వీఎస్ లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ సాంకేత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఎన్నార్పీ అగ్రహారంలో పర్యటిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీహరనాథ్

ఉండి: గ్రామాల్లో ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, స్వమిత్వ కార్యక్రమానికి సహకరించాలని జెడ్పీ సీఈవో ఎం. శ్రీహరనాథ్ అన్నారు. గురువారం ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో పర్యటించి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి అధికారులు కొలతలు కొలిచే కార్యక్రమాన్ని అలాగే తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి అధికారులు,సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గవెంకటాచార్యులు, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీశ్రీనివాస్, ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్,డిప్యూటీ ఎంపీడీవో సీవీఎస్ రెడ్డి, కార్యదర్శి జీవీటీ నాయుడు, పంచాయితీ పాలవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



భీమవరంలో అనాథ మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవతా సంస్థ మానవత్వం చాటుకుంది. వన్‌టౌన్ ప్రాంతంలో మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో మృతి చెందిన వ్యక్తి అనాథగా గుర్తించిన భీమవరం వన్‌టౌన్ పోలీసులు మృతదేహం ఖననం కార్యక్రమానికి సహకారం అందించాల్సిందిగా మానవతా సంస్థను కోరడంతో గురువారం మృదేహానికి ఖననం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, సంస్థ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ఎస్‌కే చాన్‌బాషా, అల్లు శ్రీనివాస్, షేక్ ఖాసిం, వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ జీజీఎస్ఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి చేరిన బొజ్జ గణపయ్య



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి విగ్రహం



దొడ్డనపూడిలో ఏర్పాటు చేసిన 15 అడుగుల వినాయకుని విగ్రహాన్ని క్రేన్ ద్వారా తీస్తున్న దృశ్యం

ఆకివీడు: వినాయక చతుర్థి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పూజలందుకున్న గణనాథుడున్ని ఘనంగా గంగమ్మ ఒడికి సాగనంపారు. స్థానిక శాంతి నగర్ వద్ద వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవాలు ముగింపు సందర్భంగా అఖండ పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమం తిలకించారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పూలు పండ్ల వర్తక సంఘం ఏర్పాటు చేసిన ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం బొజ్జగణపయ్యను గంగమ్మ ఒడికి సాగనంపారు.

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

కాళ్ల: వినాయక చవితి వేడుకలు ముగింపు దశకు వచ్చాయి. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. ప్రధానంగా కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో రాజరాజేశ్వరి కమ్మవారి ఆలయం వద్ద 15 అడుగుల గణేష్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

బాల్య వివాహాలు భవిష్యత్తుకు చేటు



మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మిషన్ శక్తిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉండి: బాల్య వివాహాలు ఆడబిడ్డల భవిష్యత్తుకు తీరని చేటు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ నిర్మల అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంపై మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, మంచి ఆరోగ్యం, చదవుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ పేదరికాన్ని తరమికొట్టాలంటే దానికి చదవు ఒక్కటే మార్గమని తెలిపారు. బాగా చదవుకుంటే మంచి ఉద్యోగంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా తొలగిపోయి బాలికల భవిష్యత్తు మారిపోతుందని అన్నారు. ఆలాగే బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రత కూడా చాలా ప్రాముఖ్యమని పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి రోగాలు దరిచేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఉపాధాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు సరికావు



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన రైతు సంఘ నాయకులు

భీమవరం: గుత్తి ప్రాంతంలో సోలార్ ఇండస్ట్రీ కోసం బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ప్రవర్తనకు నిరసగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గురువారం భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ సోలార్ కంపెనీలకు ఏజెంట్‌గా ఎమ్మెల్యే జయరాం ఉండడం సరైనది కాదన్నారు. ఎమ్మెల్యే జయరాం వెంటనే ప్రభాకర్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చినమిల్లి వెంకటరాయుడు

వీరవాసరం: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ వీరవాసరం మండల ఉపాధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, అండలూరు బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ కోడే శ్రీనివాస్ పార్టీ నాయకులు తెలిపారు. భీమవరం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడుతో గురువారం వీరవాసరం మండలం బీసీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భీమవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ బీసీలు అంతా ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అలాగే ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీకి విజయం అందజేయాలని పిలుపునిచ్చారు. బీసీలను గుర్తించి రాజకీయంగా సామాజిక న్యాయం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ నాయకులు కోడే శ్రీనివాస్, పిల్లివీరేశ్వరరావు, మేకా శ్రీనివాస్, ఇళ్ల శ్రీనివాస్, కదలి సుబ్రహ్మణ్యం, గుబ్బల రామ్ ప్రసాద్, తంగెళ్ల నాని, కేతా నరేష్, శీలం వీరరాఘవులు, వీరవల్లి రాఘవులు, పంపన బలరామ్, వేంద్ర ఉదయ్‌భాస్కరరావు, బొండాడ శ్రీనివాస్, బండి శ్రీనివాస్, బొక్కా బాలకృష్ణ, కేతా అర్జునుడు, జక్కంశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



దొంగపిండిలోని హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గొల్లవానితిప్ప పీహెచ్‌సీ నేత్ర వైద్యుడు బి. రామకృష్ణ సూచించారు. భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యుడు బి. రామకృష్ణ మాట్లాడుతూ దృష్టి లోపం వల్ల తలపోటు తరచూ వస్తుందన్నారు. కళ్లు మసకబారడంతో బ్లాక్ బోర్డు, పుస్తకాలపై అక్షరాలు సరిగ్గా కనపడవని దీంతో విద్యార్థులు చదువులో వెనుకబడి ఉంటారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉచిత కంటి వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు నిర్వహించడం కళ్ల దృష్టి లోపం బయటపడుతుందన్నారు. తద్వారా కళ్లకు చికిత్స చేయించడం, కళ్ల జోడులు వేయించడం వంటివి చేయించవచ్చన్నారు. అనంతరం 82 మంది విద్యార్థులకు కళ్ల పరీక్షలు 25 మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె. వీరభద్రరావు, ఎమ్ఎల్‌హెచ్‌పీ అనూష, ఎంపీ హెచ్‌ఏ ఎం. నారాయణరాజు, ఆర్ కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి



ఉండిలో ఛలో విజయవాడ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉండి: విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్యక్షుడు కే రోహిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6వ తేదీ శనివారం నిర్వహిస్తున్న ఛలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విద్యారంగంలోని అన్ని సమస్యలను పరిష్కరించేస్తామని చెప్పిన మంత్రి లోకేష్ ఎందుకు పరిష్కరించడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్ అద్దె భవనాల్లో అత్యంత దారుణంగా ఉన్నాయని, వాటిని సొంత భవనాల్లోకి మార్చి విద్యార్థుల ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకుండా తెచ్చిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని విద్యార్థుల పట్ల విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటాలకు అనుకూలంగా స్పందించాలని కోరారు. ఈనెల 6వ తేదీన నిర్వహించే ఛలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కే సాయి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.